sahanamvande.com

epaper.sahanamvande.com

సహనం వందే

హైదరాబాద్ | 01-09-2026 మంగళవారం | సంపుటి-02 సంచిక : 142 EDITOR: ROHINI



మహిళ గడప దాటితే విధ్వంసమేనా?

మహిళలపై ముస్లిం మత పెద్దల ఆంక్షలు

ఇరవై ఒకటో శతాబ్దంలో చంద్రుడి మీదికి రాకెట్లు దూసుకుపోతుంటే, ఏఐ యుగంలో ప్రపంచాన్ని శాసిస్తుంటే... మన దేశంలో కొందరు మాత్రం మహిళలను నాలుగు గోడల మధ్యే బందీ చేయాలని చూస్తున్నారు. కేరళలో జరిగిన ఓ సభలో ఇస్లామిక్ స్కాలర్ కాంతపురం ఏపీ అబూబక్కర్ ముస్లియార్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు దేశవ్యాప్తంగా పెను దుమారమే రేపుతున్నాయి. సంప్రదాయాల పేరుతో అసలు ఏం జరుగుతోంది? మహిళలు బయటికి వస్తే సమాజం సర్వనాశనం అయిపోతుందట! అబ్బో ఎంత పెద్ద మాట చెప్పేశారు?

- సహనం వందే, కేరళం

- **కేరళలో చాందసవాదం వికృత రూపం**
- **పాతకాలపు ఆలోచనలు..హక్కుల ఉల్లంఘన**

కేరళలో సున్నీ-షఫీ ఇస్లామిక్ పండితుల అత్యున్నత మండలి అయిన కేరళ జమియ్యతుల్ ఉలేమా మరోసారి తీవ్ర వివాదానికి కేంద్రబిందువు అయింది. ఈ సంస్థ అధ్యక్షుడు ఇ. సులైమాన్ ముస్లియార్, ప్రధాన కార్యదర్శి కాంతపురం ఎపీ అబూబక్కర్ ముస్లియార్ ఇటీవల ఒక విచిత్రమైన సర్క్యులర్ జారీ చేశారు. ఈ సర్క్యులర్ సారాంశం ఏమిటంటే, మహిళలు బహిరంగ వేదికలపై పురుషులతో కలిసి ఉండటానికి వీల్లేదని, బహిరంగ ప్రదేశాల్లో అసలు కనిపించకూడదని స్పష్టంగా ఆదేశించారు. మతపరమైన వేడుకలు, కార్యక్రమాలలో మహిళల పాత్ర ఉండకూడదని ఈ నిబంధనలు చెబుతున్నాయి.

మహా విధ్వంసం జరుగుతుందట

కొచ్చిలో జరిగిన ఒక ఇస్లామిక్ సదస్సులో ఈ వివాదాస్పద సర్క్యులర్ పై కాంతపురం అబూబక్కర్ ముస్లియార్ మరింత స్పష్టతనిస్తూ వివాదానికి ఆజ్యం పోశారు. మహిళలను పబ్లిక్ ప్లాట్‌ఫారమ్‌లపైకి తీసుకురావడం వల్ల సమాజంలో మహా విధ్వంసం జరుగుతుందని ఆయన బహిరంగంగానే హెచ్చరించారు. ఈ ప్రమాదాన్ని ముందే గుర్తించిన ఇస్లాం మతం మహిళలకు పర్దాను తప్పనిసరి చేసిందని ఆయన స్పష్టం చేశారు. పవిత్ర ఖురాన్ గ్రంథం ప్రకారం మహిళలు తమ ఇళ్లలోనే జీవించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ బహిరంగ ప్రదేశాల్లో కనిపించకూడదని ఆయన తన ప్రసగంలో నొక్కి చెప్పారు. వంద సంవత్సరాలుగా సంస్థ నాయకులు ఇదే విషయాన్ని బోధిస్తూ వస్తున్నారని ఆయన గుర్తుచేశారు.

ఎవరికీ భయపడేది లేదు

ఈ మార్గదర్శకాలను పాటించడం వల్లే మన దేశంలోని మహిళలు తమ పరువును, మర్యాదను కాపాడుకోగలిగారని అబూబక్కర్ ముస్లియార్ చెప్పుకొచ్చారు. మతాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేసిన పండితులు ఈ విషయాలపై మాట్లాడాల్సిన బాధ్యత ఉందని, ఎంతమంది వ్యతిరేకించినా తాము ఈ ప్రచారాన్ని ఆపేది లేదని స్పష్టం చేశారు. తమ నిర్ణయాలను, అభిప్రాయాలను ఎవరు ప్రశ్నించినా తాము వెనకడుగు వేసే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. మతపరమైన చట్టాలను అమలు చేయడంలో ఎలాంటి రాజీ పడేది లేదని, ఎవరికీ భయపడేది లేదని ఆయన కుండబద్దలు కొట్టినట్లు చెప్పారు.

రాజ్యాంగ హక్కులపై దాడి

అయితే ఈ చాందసవాద ప్రకటన వెలువడిన వెంటనే కేరళం రాజకీయాల్లో పెద్దఎత్తున దుమారం రేగింది. అనేక మంది ప్రముఖ మహిళా రాజకీయ నాయకులు, సామాజిక కార్యకర్తలు ఈ సర్క్యులర్‌ను తీవ్రంగా ఖండించారు. ఆధునిక యుగంలో మహిళలను తిరిగి వెనక్కి నెట్టేసేలా ఇలాంటి నిబంధనలు ఉండటం రాజ్యాంగ హక్కులకు విరుద్ధమని వారు మండిపడుతున్నారు. ఎస్ఎఫ్ఐ కేరళ యూనిట్ దీనిపై తీవ్రంగా మండిపడింది. ఈ నిర్ణయం పూర్తిగా మహిళా వ్యతిరేకమని, ఆధునిక సమాజ పోకడలకు ఏమాత్రం పొంతన లేని తిరోగమన చర్య అని ఎస్ఎఫ్ఐ మండిపడింది.

మతం ఆధునిక హక్కుల ఘర్షణ

ఈ మొత్తం పరిణామాన్ని పరిశీలిస్తే మతం, ఆధునిక హక్కుల మధ్య ఘర్షణ మరోసారి బట్టబయలయిందని అర్థమవుతుంది. మహిళలు చదువులో, ఉద్యోగాల్లో, రాజకీయాల్లో అగ్రభాగాన నిలుస్తున్న ఈ రోజుల్లో వారిని పబ్లిక్ స్పేస్ నుంచి బహిష్కరించాలనే డిమాండ్లు రావడం విచారకరం. సమాజంలో అసమానతలను తొలగించాల్సిన పెద్దలే ఇలాంటి ఛాందసవాద భావాలను ప్రోత్సహిస్తే అది దేశ పురోగతికే పెద్ద ఎదురుదెబ్బ అవుతుంది.

తిప్పికొట్టాల్సిన బాధ్యత

ఏది మంచి, ఏది చెడు అనేది సమాజమే నిర్ణయించుకోవాలి తప్ప కొద్దిమంది పండితులు డిక్టేట్ చేసే కాలం చెల్లిపోయింది. మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే ఏ నిబంధననైనా సమాజం తిప్పికొట్టాల్సిన బాధ్యత అందరిపై ఉంది. చట్టబద్ధమైన హక్కుల కోసం మహిళలు తమ గొంతును మరింత గట్టిగా వినిపించాల్సిన అవసరం ఉంది. అప్పుడే ఇలాంటి పాతకాలపు ఆలోచనలకు తెరపడుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. మహిళలు బయటికి వస్తే సర్వనాశనం అయిపోతుందనే ఈ పిచ్చి ఆలోచనలు మారకపోతే, సమాజమే సర్వనాశనం అయిపోతుంది.

వీసా లేని విదేశీ ప్రయాణం

సెప్టెంబర్ నెలలో ఈ దేశాలు ప్రత్యేకం

- **భూటాన్ నుంచి సీషెల్స్ వరకు స్పెషల్ టూర్లు**
- **జీవితం ఒక్కటే... బ్యాగ్స్ సర్దేయండి మరి**

జీవితం ఒక్కటే... నచ్చినట్లు తిరుగుతూ ఎంజాయ్ చేయాలి కానీ కేవలం పనులకే పరిమితం కాకూడదు. సెప్టెంబర్ నెల రాగానే చాలా మందికి ట్రావెల్ పిచ్చి పట్టుకుంటుంది. ఎందుకంటే వర్షాకాలం ముగిసి శీతాకాలం మొదలయ్యే ఈ సమయంలో వాతావరణం ఎంతో ఆహ్లాదకరంగా మారుతుంది. మీ వద్ద పాస్‌పోర్ట్ ఉంటే చాలు, ఎలాంటి వీసా టెన్షన్ లేకుండా తిరిగేయగల అందమైన దేశాలు ఏంటో తెలుసుకుందాం రండి. - సహనం వందే, హైదరాబాద్:

సెప్టెంబర్ నెలలో వాతావరణం ఎంతో ప్రశాంతంగా ఉండే బెస్ట్ ప్లేస్ భూటాన్. మన దేశం నుంచి ఎలాంటి వీసా లేకుండా, కేవలం ఎంట్రీ పర్మిట్ తో వెళ్లిపోవచ్చు. టిఫు, పునాఖా జోంగ్, పారో వంటి అద్భుతమైన ప్రాంతాలను కళ్లారా చూసిరావచ్చు. సాహసాలు ఇష్టపడే వారైతే ప్రసిద్ధమైన టైగర్స్ నెస్ట్ హైకింగ్ ను కూడా సులభంగా ట్రై చేయవచ్చు.

మారిషస్ ఐలాండ్ ట్రిప్

మనం కేవలం సముద్రపు ఒడ్డున కూర్చోవడమే కాకుండా ఒక క్లాసిక్ ఐలాండ్ ట్రిప్ కోరుకుంటే మారిషస్ పర్ఫెక్ట్ ఛాయిస్. పోర్ట్ లూయిస్ లోని రంగురంగుల మార్కెట్లు, బ్లాక్ రివర్ గార్జెస్ నేషనల్ పార్క్ ఇక్కడి ప్రత్యేకతలు. షమరేల్ అందాలు చూస్తూ బోటింగ్ చేయడం ఒక అద్భుతమైన అనుభూతిని ఇస్తుంది. సెప్టెంబర్ నెలలో ఇక్కడ బీచ్ డేస్ తో పాటు సైటోసీయింగ్ చేయడానికి కూడా చాలా అనుకూలంగా ఉంటుంది.

కజకిస్తాన్ అందాలు

కొంచెం భిన్నమైన ప్రదేశాలను అన్వేషించాలనుకునే వారికి కజకిస్తాన్ ఒక చక్కని అవకాశం. అల్మాటీ నగరం చుట్టూ ఉండే భారీ పర్వతాలు, సెప్టెంబర్ లోని చల్లటి వాతావరణం మనసును దోచుకుంటాయి. పాన్ఫిలోవ్ పార్క్, జెంకోవ్ కేథడ్రల్ ఇక్కడ ఖచ్చితంగా చూడాల్సిన ప్రదేశాలు. బిగ్ అల్మాటీ లేక్, చరన్ కాన్యన్ వంటి అద్భుతమైన ల్యాండ్‌స్కేప్స్ మీ ట్రిప్‌ని జీవితాంతం గుర్తుండిపోయేలా చేస్తాయి. మీకు సమయం ఉంటే కొల్సాయ్ సరస్సులను కూడా మీ ప్రయాణ జాబితాలో చేర్చుకోవచ్చు.

థాయిలాండ్ విహారం

భారతీయులకు ఇంటర్నేషనల్ ట్రిప్ అనగానే టక్కున గుర్తువచ్చే మరో పేరు థాయిలాండ్. సెప్టెంబర్ లో ఇక్కడ వర్షాలు పడే అవకాశం ఉన్నప్పటికీ ప్లానింగ్ సరిగ్గా ఉంటే అద్భుతమైన అనుభూతిని పొందవచ్చు. బ్యాంకాక్ లో షాపింగ్, ఫుడ్, టెంపుల్స్ ఎంజాయ్ చేయవచ్చు. అలాగే చియాంగ్ మాయ్ లో పాత నగరాలు, పర్వత ప్రాంతాలు చాలా ప్రశాంతతను ఇస్తాయి. అయితే ఐలాండ్స్‌కి వెళ్లే ముందు మాత్రం అక్కడ వాతావరణ పరిస్థితులను ఒకసారి చెక్ చేసుకోవడం చాలా మంచిది.

మలేషియా మజా

తక్కువ రోజుల్లో సిటీ లైఫ్ తో పాటు ప్రకృతిని ఆస్వాదించాలనుకునే వారికి మలేషియా బెస్ట్ ఆప్షన్. కౌలాలంపూర్ లోని పెట్రోనాస్ ట్విన్ టవర్స్, చైనాటౌన్, ఫుడ్ స్ట్రీట్స్ మిమ్మల్ని ఎంతగానో ఆకట్టుకుంటాయి. ఆ తర్వాత పెనాంగ్‌లోని హెరిటేజ్ వీధులను చుట్టిరావచ్చు.పచ్చదనం ఇష్టపడే వారి కోసం లంగ్కావి బీచ్‌లు, అటవీ ప్రాంతాలు స్వాగతం పలుకుతాయి. ముఖ్యంగా ఇండియన్ల కోసం మలేషియా వీసా-ఫ్రీ ఎంట్రీని వచ్చే డిసెంబర్ వరకు పొడిగించడం మనకు చాలా ప్లస్ పాయింట్.

మరిన్ని ప్రదేశాలు

మరింత ప్రశాంతమైన వాతావరణంలో, రద్దీకి దూరంగా గడపాలనుకుంటే సీషెల్స్ వైపు అడుగులు వేయవచ్చు. మహే ద్వీపం ఇక్కడ ప్రధాన కేంద్రం. ఇక్కడ ఎన్నో అద్భుతమైన బీచ్‌లు, హైకింగ్ ట్రైల్స్ ఉన్నాయి. ప్రసిద్ధ గ్రానైట్ బండరాళ్లకు నిలయమైన లా డిగు ద్వీపంలో ప్రయాణం ఎంతో రిలాక్సింగ్‌గా ఉంటుంది. కాస్త ఎక్కువ దూరం ప్రయాణించడానికైనా సిద్ధపడితే ఫిజీ ఒక అద్భుతమైన ట్రాపికల్ ఎస్కేప్. అలాగే బీచ్‌లు, మ్యూజిక్, ఫుడ్, విభిన్నమైన సంస్కృతిని కోరుకునే వారికి జమైకా గొప్ప అనుభూతిని ఇస్తుంది. ప్రతి దేశానికి సంబంధించిన స్థానిక నియమ నిబంధనలను, ఎంట్రీ పర్మిట్ రూల్స్‌ను ముందుగానే గమనించాలి. ఫ్లైట్ టికెట్లు, హోటల్ బుకింగ్స్ ముందుగానే చేసుకుంటే అనవసరమైన ఖర్చులను తగ్గించుకోవచ్చు.

జొమాటోలో ఉద్యోగాల ఊచకోత

హైదరాబాద్ కేంద్రం మూసి తొలగింపు

- **ఇకనుంచి గురుగ్రామ్‌కు సపోర్ట్ ఆపరేషన్స్**
- **4 నెలల పూర్తి వేతనం ఇచ్చేలా ప్రణాళిక**
- **శాశ్వతంగా లాప్‌టాప్‌లు ఇవ్వాలని నిర్ణయం**

ఇంట్లో కూర్చుని ఒకే ఒక్క క్లిక్‌తో వేడివేడి బిర్యానీ తెప్పించుకునేలా చేసిన ఫుడ్ డెలివరీ దిగ్గజం జొమాటో ఇప్పుడు తన ఉద్యోగులకు మాత్రం చేదు నిజాన్ని మిగిల్చింది. టెక్నాలజీ రంగంలో దూసుకుపోతున్న హైదరాబాద్ సిటీలో అకస్మాత్తుగా జొమాటో కస్టమర్ సపోర్ట్ సెంటర్ మూతపడింది. దాన్ని నమ్ముకుని బతుకుతున్న 240 మంది ఉద్యోగుల జీవితాలు ఇప్పుడు మలుపులు తిరిగాయి. - సహనం వందే, హైదరాబాద్

దేశవ్యాప్తంగా ఫుడ్ డెలివరీ సేవల్లో తిరుగులేని పేరు సంపాదించుకున్న జొమాటో సంస్థ తాజాగా తీసుకున్న ఒక అనూహ్య నిర్ణయం అందరినీ విస్మయానికి గురిచేసింది. కంపెనీ తన కస్టమర్ డిలైట్ ఆపరేటింగ్ మోడల్‌ను పూర్తిగా మార్పులు చేస్తూ, సంస్థాగత అవసరాల కోసం పెద్ద ఎత్తున ఉద్యోగుల కోతకు తెరలేపింది. ఇందులో భాగంగానే మొత్తం 250 మందిని ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నట్లు అధికారిక వర్గాలు స్పష్టం చేశాయి. ఈ తాజా పరిణామం ముఖ్యంగా టెక్ హబ్ అయిన హైదరాబాద్ నగరంలోని ఉద్యోగులపై తీవ్ర ప్రభావం చూపింది.

హైదరాబాద్ కేంద్రం మూసివేత

హైదరాబాద్‌లో ఉన్న కస్టమర్ సపోర్ట్ ఆపరేషన్లను పూర్తిగా నిలిపివేస్తున్నట్లు కంపెనీ సోమవారం వెల్లడించింది. ఇప్పటివరకు వికేంద్రీకృత పద్ధతిలో నడిచిన ఈ సేవలను ఇకపై కేవలం గురుగ్రామ్‌లోని ఒకే ఒక ప్రధాన కేంద్రం నుంచి మాత్రమే నిర్వహించాలని సంస్థ నిర్ణయించుకుంది. ఈ భారీ మార్పు కారణంగా ఒక్క హైదరాబాద్ కేంద్రంలోనే సుమారు 240 మంది ఉద్యోగులు తమ ఉపాధిని కోల్పోవాల్సి వచ్చింది. అయితే, ఈ నిర్ణయం వారి వ్యక్తిగత పనితీరును బట్టి కాకుండా కేవలం కంపెనీ వ్యాపార వ్యూహ మార్పుల వల్ల మాత్రమే తీసుకున్నట్లు యాజమాన్యం పేర్కొంది.

వ్యాపార వ్యూహంలో మార్పులు

గత 6 నెలలుగా కస్టమర్ సపోర్ట్ రంగంలో వస్తున్న వేగవంతమైన మార్పులే ఈ అనూహ్య నిర్ణయానికి అసలు కారణమని తెలుస్తోంది. ప్రస్తుతం చాలా వరకు కస్టమర్ సమస్యలను ప్రత్యేక భాగస్వాముల ద్వారా సమర్థవంతంగా నిర్వహిస్తున్నట్లు కంపెనీ వర్గాలు తెలిపాయి. ఇంట్లోనే ఉండి చేయాల్సిన పనులను కూడా ఇకపై ప్రొడక్ట్, టెక్నాలజీ, అనలిటిక్స్, ఇతర ప్రధాన వ్యాపార విభాగాలకు దగ్గరగా గురుగ్రామ్ కేంద్రం నుంచి మాత్రమే ఒకే సమన్వయంతో నడిపించాలనేది కంపెనీ ఆలోచనగా కనిపిస్తోంది. అందుకే ఈ వికేంద్రీకృత కేంద్రాన్ని మూసివేసి హైదరాబాద్ కార్యకలాపాలకు మంగళం పాడారు.

ఉద్యోగులకు ఉపశమన చర్యలు

ఉద్యోగులను తొలగిస్తున్నప్పటికీ మానవతా దృక్పథంతో కంపెనీ కొన్ని కీలకమైన ఉపశమన చర్యలను ప్రకటించిందని కంపెనీ వర్గాల సమాచారం. ఉద్యోగం కోల్పోయిన ప్రతీ ఉద్యోగికి ఆగస్ట్ నెల జీతంతో పాటు అదనంగా 4నెలల పాటు పూర్తి వేతనాన్ని అందించనున్నారు.ఇందులో కాంట్రాక్ట్ నోటీస్ పేతో పాటు ఒకసారి ఇచ్చే ప్రత్యేక ఎక్స్ గ్రేషియా మొత్తం కూడా చేర్చి ఉంటుందని స్పష్టం చేశారు. హఠాత్తుగా ఉపాధి కోల్పోయిన వారికి ఆర్థికంగా కొంత అండగా నిలవాలనే ఉద్దేశంతో ఈ భారీ సెవరెన్స్ ప్యాకేజీని ప్రకటించినట్లు తెలుస్తోంది.

ఆరోగ్య భద్రత గ్యాజెట్స్...

ఆర్థిక సాయంతో పాటు ఉద్యోగుల ఆరోగ్య భద్రతకు కూడా కంపెనీ కొంతవరకు భరోసా కల్పించే ప్రయత్నం చేసింది. ఉద్యోగులందరికీ వర్తించే మెడికల్ ఇన్సూరెన్స్ సదుపాయం అలాగే కౌన్సెలింగ్ సపోర్ట్ సేవలను వచ్చే ఏడాది అంటే మార్చి 31వరకు ఎలాంటి అంతరాయం లేకుండా కొనసాగిస్తామని తెలిపారు. కేవలం డబ్బులు, ఇన్సూరెన్స్ మాత్రమే కాకుండా ఉద్యోగులు రోజువారీ కార్యాలయ పనుల కోసం ఉపయోగించుకుంటున్న కంపెనీ ఇష్యూ చేసిన లాప్‌టాప్‌లు, ఇయర్‌ఫోన్‌లను వాపసు తీసుకోకుండా వారి వ్యక్తిగత వాడకం కోసం శాశ్వతంగా ఇవ్వాలని నిర్ణయించారు.

ఉపాధి భద్రతపై నీలినీడలు

ఈ తాజా పరిణామం కేవలం ఒక జొమాటో కంపెనీకి మాత్రమే పరిమితం కాకుండా దేశంలోని ఇతర స్టార్టప్, టెక్ ఆధారిత సంస్థల పనితీరుపై కూడా అనేక ప్రశ్నలను లేవనెత్తుతోంది. టెక్నాలజీ మారుతున్న కొద్దీ ఉద్యోగ భద్రత అనేది ఎంత అస్థిరంగా మారుతుందో ఈ ఘటన మరోసారి నిరూపించింది. భవిష్యత్తులో మిగిలిన కంపెనీలు కూడా ఇలాంటి ఖర్చుల కోత విధానాలనే అనుసరిస్తాయా అనే ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది.